## కెసిఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 10, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ కాలనీ (డబుల్ బెడ్‌రూమ్) లో నెలకొన్న సమస్యలపై కాలనీ వాసులు జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశర్లుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వారంతా కాలనీ సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాలనీకి వెళ్లేందుకు రహదారి లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, అలాగే కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అంతేకాకుండా కొందరు వ్యక్తులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కబ్జా చేశారని ఆయన దృష్టికి తెచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తొందరలోనే కాలనీ సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు కట్ట ప్రభాకర్, గౌరవ అధ్యక్షురాలు బాలమణి, కమిటీ సభ్యులు గొంగళ్ళ వెంకటి, లద్ద నర్సింలు, కైరంకొండ చంద్రం, దేశాయిపేట శ్రీనివాస్, తూర్పు ఎల్లాగౌడ్, మెక్కొండ పోచయ్య, మద్దెల కృష్ణతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు..



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా శ్రీకాంత్‌యాదవ్

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త :** బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేశ్ ఆధ్వర్యంలో బిజెపి కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడిగా గడ్డమీది శ్రీకాంత్‌యాదవ్‌ను నియామకం చేయడం జరిగింది. బుధవారం మెదక్ లో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు భైండ్ల సత్తన్న,బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, కిసాన్ మోర్చా ఇంచార్జీ వెంకట్‌రెడ్డిల చేతుల మీదుగా కిసాన్ మోర్చా మండల నూతన అధ్యక్షులుగా శ్రీకాంత్‌యాదవ్ ను నియమిస్తు నియామకపు పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన కిసాన్ మోర్చా మండల నూతన అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తిస్తానని అన్నారు.తనకు ఈ పదవిని అప్పగించిన బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, కిసాన్ మోర్చా ఇంచార్జీ వెంకట్‌రెడ్డి ,బిజెపి మండల అధ్యక్షులు నీలి నాగేశ్ తదతరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

## ఎఎస్ఐపై కేసు నమోదు చేయాలి

### న్యాయవాదుల నిరసన ర్యాలీ... వన్ టౌన్‌లో ఫిర్యాదు

**సిద్దిపేట అర్బన్, జూలై 10, ప్రభాతవార్త :** అకారణంగా దాడి చేసిన టూ టౌన్ ఎఎస్ఐపై కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేస్తూ సిద్దిపేట బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు బుధవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపి కోర్టు నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి సీఐ వినతి పత్రం అందజేశారు. సిద్దిపేట కోర్టులో పని చేస్తున్న న్యాయవాది రవీందర్‌పై దాడి చేసిన సిద్దిపేట టూ టౌన్ ఎఎస్ఐ ఉమారెడ్డి, సీఐని వెంటనే విధులనుంచి సస్పెండ్ చేసి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ జరుపాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా ఈనెల 11,12వ తేదీలలో కోర్టు విధులకు హాజరు కావొద్దని తీర్మానం చేశారు. టూ టౌన్ సీఐ,ఎఎస్ఐ ఉమారెడ్డి న్యాయవాది రవీందర్‌పై అకారణంగా, అకర్యాదగా పిడిగుద్దులతో దాడి చేసిన సంఘటనలో ఉమారెడ్డితో పాటు సీఐపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సీపీ అనురాధను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, శివాజీ, తాటికొండ రమేష్, కర్రోళ్ల రవిబాబు, యాదగిరి, సాయినారాయణ, పవన్,కార్తీక్, నగేష్, భూమిరాజ్, రేణుక, సూర్యకళ, కార్యవర్గ సభ్యులు,న్యాయవాదులు పాల్గొన్నారు.

## వృథాగా మిషన్ భగీరథ నీరు

### -పక్కనే వేలాడుతున్న విద్యుత్ వైర్లు



బర్దీపూర్-రేజింతల్ గ్రామాల మధ్య వృథాగా పారుతున్న నీరు

**ఝరాసంగం, జూలై 10, ప్రభాతవార్త:** ప్రజల ప్రాణాల మీదకు వస్తే కాని అధికారులు పట్టించుకునేలా లేరని ప్రజలు మండిపడుతున్నారు. మిషన్ భగీరథ నీరు వృధాగా పారుతుండటంతో పాటు అక్కడే విద్యుత్ వైర్లు వేలాడుతున్నా సంబంధిత శాఖల అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి, ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండలంలోని బర్దీపూర్ న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్‌కు వెళ్లే రోడ్డులో మిషన్ భగీరథ నీరు వృధాగా నేలపాలవుతున్నాయి. నీరు వృధాగా పారుతున్న ప్రాంతంలో విద్యుత్ వైర్లు నేలను తాకేలా వేలాడుతున్నాయి నీరు వృధాగా పారుతున్న విషయాన్ని ప్రభాతవార్త ఆర్‌డబ్లుఎస్ ఏఈ సృజన్ దృష్టికి తీసుకుపోగా ఎయిర్ ఫిల్టర్ పోయినందున నీరువృదాగా పారుతోందని,వెంటనే మరమ్మతులు చేయించి నీరు వృదా కాకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ వివరణ ఇచ్చారు.

## డిజిపిని కలిసిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి



నూతన డిజిపి డాక్టర్ జితేందర్‌ను కలిసిన ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జితేందర్‌ను బుధవారం రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయానికి చేరుకున్న గిరిధర్‌రెడ్డి డిజిపికి పూలబొకనే అందించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిదర్‌రెడ్డితో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఉన్నారు.

## మద్యం దుకాణానికి అనుమతి రద్దు చేయాలి

**చిన్నశంకరంపేట, జూలై 10,ప్రభాతవార్త:** మండల పరిధి మడూరులో మద్యం దుకాణం అనుమతిని రద్దు చేయాలని గ్రామస్తులు బుధవారం జిల్లా పాలనాధికారికి వినతి పత్రం అందించారు. మద్యం దుకాణం గ్రామ శివారులోని రైతు వేదిక భవనం పక్కనే ఏర్పాటు చేశారని, ప్రారంభించడానికి నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. రైతు వేదికలో నెలలో రెండు సార్లు సమావేశానికి వ్యవసాయాధికారులు నిర్వహిస్తే మహిళా రైతులు కూడ వస్తారని అన్నారు. రైతు వేదికకు ఆనుకొని రెండు దేవాలయాలు ఉన్నాయని, గ్రామస్తులు, మహిళలు నిత్యం గుడికి వేళ్లి వస్తుంటారని, అక్కడ మద్యం దుకాణం వెలువడటంతో మహిళలలు ఆందోళణ చెందుతున్నారు. మడూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంగాయపల్లి నుండి విద్యార్థులు నడుచుకుంటూ ఉదయం సాయంత్రం వస్తుంటారని, మద్యం దుకాణం ముందు నుండి వెళ్లాలని, విద్యార్థులకు మందు బాబుల బెడద ఉంటుందని వారు తెలిపారు. మడూరు గ్రామం మద్యం నిషేద గ్రామం అని తెలినప్పటికి అబ్కారిశాఖ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండా మద్యం దుకాణంకు ఎలా అనుమతి ఇచ్చారని వారు ప్రశ్నిస్తున్నారు. మద్యం దుకాణంను ప్రారంభిస్తే మహిళలు పెద్ద ఎత్తున రస్తారోకో చేపడుతామని తెలిపారు.

## బాల కార్మికులతో పనులు చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు

**పటాన్‌చెరు, జూలై 10,ప్రభాతవార్త:** జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీ చౌరస్తా సమీపంలో ఉన్న రాందేవ్ కిరాణా దుకాణంలో 15 సంవత్సరాల లోపు పనులను చేస్తున్న కార్మికుడిని బుధవారం లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ బాబును అదుపులోకి తిసుకోని సంబంధిత యజమానిపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులతో పనులు చేయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సర్వేను అడ్డుకున్న భూనిర్వాసితులు

**కొండ పోచమ్మ సాగర్ సంగారెడ్డి కెనాల్ సర్వేకు వచ్చిన అధికారులు**
**ఎకరాకు రూ. 60 లక్షల పరిహారం ఇవ్వాలి**
**భూములకు భూములు ఇవ్వాలని రైతుల డిమాండ్**



కొండపోచమ్మసాగర్ సంగారెడ్డి కెనాల్ సర్వే అడ్డుకొని ధర్నా చేస్తున్న భూములు కోల్పోతున్న రైతులు

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త :** ఇటీవల కొండపోచమ్మ సాగర్ కాలువ నిర్మాణానికి ఆర్డీవో ఆధ్వర్యంలో రైతు వేదికలో ఆయా గ్రామాలలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ నేపథ్యంలో కొండపోచమ్మ సాగర్ సంగారెడ్డి కెనాల్ రిచ్ 2 కాలువ నిర్మాణానికి గాను భూములను సర్వే చేయడానికి ఆయా ప్రభుత్వశాఖల అధికారులు డిఈ కవితాదేవి, ఏఈలు శ్రీనివాస్‌గౌడ్, సుప్రజ. శైలజ బృందం బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంట గ్రామ శివారులో సర్వే చేయడానికి వెళ్లడం జరిగింది. విషయం తెలుసుకున్న కాలువలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులు కొండ పోచమ్మ కాలువ తమకు వద్దని ఈ సర్వేను నిలిపివేయాలని రైతులు సర్వే చేయడాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్బంగా భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులు సర్వే చేయవద్దని అక్కడే కూర్చుని ధర్నా నిర్వహించారు.రైతులు వంటెల నర్సింహారెడ్డి, ప్యాట మహేశ్‌గౌడ్ వజ్జె పెంటయ్య, ఎంబరి అర్జున్, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూములకు బదులుగా భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో ఎకరాకు 60 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గతంలో రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూముల కోల్పోగా పేద రైతులందరు బజారునపడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ కాలువ నిర్మాణంలో సైతం పేద రైతుల భూములే ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం భూముల ధరలు రెక్కలొచ్చాయని ఈ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న పేద రైతులు అందరు ఎంతగానో నష్టపోతారని అన్నారు. కొండ పోచమ్మ కాలువలో భూములు కోల్పోతున్న పేద రైతులకు 60 లక్షల నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సందర్బంగా రైతులకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికారులు మొండిగా భూసేకరణ, సర్వేచేసినట్లయితే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. సర్వే చేయనీయకుండా రైతులు అడ్డుకోవడంతో అదికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు.



తీగుల్ గ్రామ నూతన కమిటీతో డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి

## కాంగ్రెస్ పార్టీ తీగుల్ గ్రామ అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

**జగదేవ్‌పూర్, జూలై 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరై కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పల ప్రవీణ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేశారు. అలాగే గ్రామ యూత్ కమిటీ అధ్యక్షునిగా కరుణాకర్, మైనార్టీ అధ్యక్షునిగా కుద్దుస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా తనను ఎన్నుకున్నందుకు డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ పిఏసిఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, కార్యకర్తలకు ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తీగుల్ గ్రామ మాజీ ఎంపిటిసి మహేందర్‌రెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన టిపిటిఎఫ్ అధ్యక్షుడు



**జగదేవ్‌పూర్, జూలై 10 (ప్రభాతవార్త):** విద్యాశాఖ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహారెడ్డిని బుధవారం జగదేవ్‌పూర్ మండల టిపిటిఎఫ్ అధ్యక్షుడు నేతి శంకర్ హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతానికి చెందిన ఇవి.నర్సింహారెడ్డి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు విద్యాశాఖ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మర్కుక్, జులై 10 (ప్రభాతవార్త):** దేశవ్యాప్త కార్మికుల డిమాండ్ డే సందర్భంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు సిఐటియు నాయకులు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకులు, సంస్థలను కాపాడాలని, సింగరేణి బొగ్గు గనుల వేలం పాటను ఆపి కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాల్‌లక్ష్మి, నాయకులు మల్లేశం, వెంకటేష్, యాదగిరి, లక్ష్మి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**మిరుదొడ్డి, జూలై 10, ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని సిఐటియు నాయకులు మద్దెల అంజయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని..ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలన్నార. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

# రిటైర్ట్ సైబరాబాద్ సిపి భూమికే రియల్టర్ల ఎసరు!

**ఫోర్జరీ సంతకాలతో 57 ఎకరాలకు నకిలీ అగ్రిమెంట్ టు సేల్ సృష్టి... ఆ పత్రాలతో అమ్మకానికి బేరసారాలు.. కుదిరిన బేరం**
**రూ.11లక్షలు బ్యాంకులో డిపాజిట్.. రిజిస్ట్రేషన్‌కు పట్టుబట్టడంతో బట్టబయలైన మోసం..నిందితుల అరెస్ట్..జోగిపేట సిఐ అనిల్‌కుమార్**



నిందితులను చూపుతున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్

**జోగిపేట, జులై 10, ప్రభాతవార్త:** భూముల ధరలకు రెక్కలొచ్చి కోట్లలో విలువ పలుకుతున్న క్రమంలో భూములకు సంబంధించిన మోసాలు ఎక్కువయ్యాయి. రకరకాల ప్రయత్నాలతో విలువైన భూములను కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సందర్భాలు కోకొల్లలుగా వెలికివస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భూ వివాదాలు ఎక్కువయాయి. తాజాగా మాజీ రిటైర్డ్ ఐపిఎస్, మాజీ సైబరాబాద్ కమీషనర్‌గా పనిచేసిన ప్రభాకర్‌రెడ్డి, అతని కుటుంభసభ్యులకు సంబంధించిన భూమిని కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి, అమ్మకానికి ప్రయత్నించి చివరకు పోలీసులకు చిక్కారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం జోగిపేట సిఐ అనిల్‌కుమార్ వెల్లడించారు. అందోలు గ్రామానికి చెందిన రిటైర్ట్ ఐపిఎస్, మాజీ సైబరాబాద్ సిపి ప్రభాకర్‌రెడ్డి, వాళ్ల కుటుంబీకులకు సంబంధించి అందోలు శివారులో ఉన్న 57 ఎకరాల భూమిని గత కొన్ని సంవత్సరాలుగా అమ్మకానికి పెట్టారు. వీరి భూములకు సంబంధించిన పాస్‌బుక్కులు, ఆధార్ కార్డులు మధ్యవర్తులకు పంపగా, అలా నారాయణ ఖేడ్ ప్రాంతానికిచెందిన సంజీవరెడ్డికి చేరాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలోఉన్న అతను ఈ భూమికి సంబంధించి నకిలీ సేల్ అగ్రిమెంటును తయారు చేశారు. ఇందులో భూములకు సంబంధించిన యజమానులు శేరి నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలతోపాటు యజమానులైన నలుగురికి సంబంధించిన సంతకాలు కూడా సంజీవరెడ్డినే పెట్టి, నకిలీ అగ్రిమెంట్ సేల్‌ను తయారు చేశారు. ఇందులో 57 ఎకరాల భూమిని ఎకరాకు రూ.39లక్షల చొప్పున కొనుగోలు చేసేందుకు అగ్రిమెంటు చేసుకొని, ఆమేరకు భూమి యజమానులకు రూ.2కోట్లు చెల్లించినట్లు క్యాష్ రిసిప్ట్‌ను కూడా తయారు చేశారు. ఇందులో సంజీవరెడ్డికి రాథోడ్ సుధాకర్, రవీందర్‌లు సహకరించారు. ఇలా సృష్టించిన నకిలీ అగ్రిమెంట్ సేల్ డాక్యుమెంట్ ఆధారంగా ఆ మొత్తం భూమిని తనకు తెలిసిన సహచరుల ద్వారా హైద్రాబాదులోని యాదవరెడ్డి అనే అతనికి అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. తాము రూ.39 లక్షలకు ఎకరా చొప్పున తీసుకున్నామని, తమకు ఎకరాకు అదనంగా లక్ష రూపాయలు చెల్లించి ఈ మొత్తం భూమిని తీసుకోవాలని చర్చలు జరపగా, అందుకు యాదగిరి రెడ్డి అంగీకరించారు. ఆమేరకు సంజీవరెడ్డి బ్యాంకు అకౌంట్లోకి టోకెన్ అమౌంట్‌గా రూ.11లక్షలను కూడా డిపాజిట్ చేశారు.

అనంతరం భూమిని చూపించాలని, తాము రిజిస్ట్రేషన్ చేసుకుంటామని సంజీవరెడ్డిని పలు మార్లు సంప్రదించగా, పలు రకాల కారణాలు చెబుతూ రిజిస్ట్రేషన్‌ను వాయిదా వేస్తూ వస్తుండటంతో, అనుమానం వచ్చిన యాదవరెడ్డి అందోలుకు వచ్చి భూమిని పరిశీలించారు. ఈక్రమంలో అక్కడే ఉన్న భూమి యజమాని ఎవరు మీరు, ఎందుకు ఇక్కడకు వచ్చారని ప్రశ్నించటంతో, జరిగిన విషయాన్ని అతనికి చెప్పటంతో, అవన్నీ నకిలీ పత్రాలని, తామెవరికి భూమి అమ్మలేదని చెప్పి యాదగిరిరెడ్డిని అక్కడినుంచి పంపేశారు. ఆవెంటనే ఈ విషయాన్ని జిల్లా ఎస్పీదృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శేరి నర్సింహారెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నకిలీ పత్రాలు సృష్టించి, మోసపూరితంగా ఇతరుల భూమిని అమ్మేందుకు ప్రయత్నించిన సంజీవరెడ్డి, అతనికి సహకరించిన రాథోడ్ సుధాకర్, రవీందర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతునట్లు జోగిపేట సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. ముఖ్యంగా వీరిని పట్టుకోవటంలో తీవ్రంగా కృషిచేసిన కానిస్టేబుల్లు శివకుమార్, సురేష్‌లను ఆయన ప్రశంసించారు.



తనిఖీ నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ ఖలీల్, జిల్లాఅధికారి అనుష

## హోటళ్లు, ఫ్యామిలీ దాబాలు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**సిద్దిపేట అర్బన్, జూలై 10, ప్రభాతవార్త :** జిల్లాలోని హోటళ్లు, ఫ్యామిలీ దాబాలు అండ్ రెస్టారెంట్లపై అసిస్టెంట్ పుడ్ కంట్రోలర్ ఖలీల్, జిల్లా పుడ్ సేఫ్టీ అధికారి అనుషతో కలిసి తనిఖీలు చేశారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల రాజీవ్ రహదారి పక్కన ఉన్న టోల్ గేట్ రెస్టారెంట్‌లో గడువు ముగిసిన గ్రీన్ యాపిల్ క్రష్, మిల్క్, బ్రెడ్, మిస్‌బ్రాండెడ్ టెస్ట్‌క్రాఫ్ట్ ఫ్రూట్ క్రస్, వంట గదిలో రంగు స్ప్రింక్ల్స్ ప్యాకెట్లను గుర్తించారు. అలాగే పాడైన క్యాబేజీ గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కొండపాక మండలం లకుడారంలో స్వాదిష్ట్ ఫ్యామిలి రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా వంట గది అపరిశుభ్రంగా ఉందని, వంట గదిలో వంట మనుషులు హ్యాండ్ గ్లోవ్స్, హెయిర్ నెట్స్ లేకుండా ఉన్నారని రిఫ్రిజిరేటర్‌లో పాత చికెన్, చేపాల కూర గుర్తించినట్లు తెలిపారు. సాగర్ ఎసి ఫ్యామిలీ దాబా అండ్ రెస్టారెంట్ చిన్నకోడూరులో తనిఖీ చేయగా వంట గది అపరిశ్రుభంగా ఉందని పురుగులు సోకిన బియ్యం గుర్తించినట్లు తెలిపారు. వంట మనుషులు హ్యాండ్ గ్లోవ్స్, అప్రాన్లు, హెయిర్ నెట్స్ లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. ప్రశాంత్‌నగర్‌లోని విశాల్ మోగా మార్ట్‌ను తనిఖీ చేయగా గడువు ముగిసిన అహార పదార్థాల ప్యాకెట్లను గుర్తించినట్లు వివరించారు. తనిఖీలో గుర్తించిన అహారపదార్థాల షాపింల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించి నివేదిక అధారంగా చర్యలు తీసుకుంటమని జిల్లా పుడ్ సేఫ్టీ అధికారి అనుష తెలిపారు. కాగా పుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న కిరాణ షాపు యాజమానులు తమ తమ దుకాణాలను మూసి వేయడం గమనార్హం.

## నల్ల మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



నల్ల మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

**గుమ్మడిదల, జూలై 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ సంఘాల సభ్యులు, ప్రజలు భారీ సంఖ్యలో నల్లమట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అనే రైతు నల్ల మట్టి టిప్పర్ ఢీకొట్టడంతో మృతిచెందాడని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం ముగ్గురు నుండి నలుగురు ఈ మట్టి టిప్పర్ల కారణంగా మృతి చెందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ మట్టి వ్యాపారులు మాత్రం ప్రాణ నష్టాన్ని కూడా లెక్కచేయకుండా అతివేగంతో ఇష్టానుసారంగా మట్టి టిప్పర్లను నడుపుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఈ మట్టి వ్యాపారులు మట్టి వాహనాలను అతివేగంగా నడపకుండా నెమ్మదిగా వెళ్లాలని, ముఖ్యంగా గ్రామాల్లో అతి జాగ్రత్తగా నడపాలని కోరారు. ఇష్టానుసారంగా వాహనాలను నడిపితే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, గ్రామాల్లోకి మట్టి వాహనాలను రానేయబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల నాయకులు, గుమ్మడిదల గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### నర్సాపూర్ మాజీ సర్పంచ్ సంజీవ్‌రావు మృతి

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త :** పట్టణంలో బుధవారం నర్సాపూర్ మాజీ సర్పంచ్ చౌటి సంజీవ్‌రావు మృతి చెందారు. ఆయన కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రజలు ఆయనను కడసారి చూపులు చూసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లతోపాటు తదితరులు మృతి చెందిన సంజీవ్‌రావు మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంభ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేసి అంత్య క్రియల్లో పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి దంపతుల ఆత్మహత్య

### అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు



ఆత్మహత్యకు పాల్పడిన శేఖర్, సౌమ్య (ఫైల్)

**జగదేవ్‌పూర్, జూలై 10 (ప్రభాతవార్త):** పురుగుల మందు తాగి దంపతులు ఇద్దరు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. జగదేవ్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం... ఇటిక్యాల గ్రామానికి చెందిన కర్కపట్ల శేఖర్(28) జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన ఆకారం సౌమ్య(25)తో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరికి ఇద్దరు కుమారులు ఉండగా వీరి సంసార జీవితం ఐదేళ్ల పాటు సాఫీగా సాగినప్పటికీ సంవత్సర కాలంగా వీరిమధ్య తరచూ గొడవలు రావడంతో పలుమార్లు ఇరు గ్రామాల పెద్దలు వారికి నచ్చజెప్పారు. ఇటీవల సౌమ్య తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా తండ్రి వద్ద దౌలాపూర్‌లోనే ఉండగా రెండు నెలల క్రితం భర్త శేఖర్ వచ్చి సౌమ్యను తనవెంట తీసుకెళ్ళాడు. జీవనోపాధికి తుర్కపల్లి గ్రామంలోని ఓ మామిడితోటలో శేఖర్ సూపర్ వైజర్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో వారి మధ్య మళ్లీ గొడవలు జరగడంతో జీవితంపై విరక్తిచెంది ఇద్దరు మంగళవారం అర్ధరాత్రి తమ స్వగ్రామమైన ఇటిక్యాలలో వారి పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగగా సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు.వారి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరా బాద్‌లోని లోటస్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో సౌమ్య మృతిచెందగా శేఖర్ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం 12గంటలకు మృతి చెందాడు. దంపతులు ఇద్దరు మృతిచెందడంతో కుమారులు ఇద్దరు అనాథలుగా మారారు. ఈ పరిస్థితిని చూసిన ప్రతి ఒక్కరు కన్నీటిపర్యంతమయ్యారు. శేఖర్, సౌమ్యల మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.



త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న వసంతరుషి

## బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**కొండపాక, జులై 10, ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోనాయపల్లి తాజా మాజీసర్పంచ్ మిట్టపల్లి వసంత రుషి కోరారు. బుధవారం కోనాయపల్లిలో విద్యార్థి మున్నం దీప్తి బాసర త్రిబుల్ ఐటీలో సీటు సాధించినందుకు ఆమెను శాలువాతో సన్మానించి, మెమెంటో అందించి, రూ॥ 4 వేలు ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఆదివిధంగా కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి బాసరలో త్రిబుల్ ఐటీసీట్లు సాధించిన 12 మంది విద్యార్థులను పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తు విద్యార్థులు ఉన్నత పదవులను చేరుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిని, సామాజిక కార్యకర్త పొల్కంపల్లి నరేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోనాయపల్లి త్రిక్షాధికారి ప్రియదర్శిని, కార్యదర్శి కృష్ణ, ఉప సర్పంచ్ పిట్ల రమేష్, కో ఆప్షన్ సభ్యుడు ముష్టం ఉపేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్, నరేష్ యాదవ్, సాయిరెడ్డి, ముష్టం స్వామి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మత్స్య రైతుల దినోత్సవం



జాతీయ మత్స్య రైతుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**కోహెడ, జూలై 10, ప్రభాతవార్త :** జాతీయ చేపల పెంపకం మండలి (ఎన్ఎఫ్‌డిబి) ఎస్ఎఫ్ఏసీ సహకారంతో మత్స్య మంత్రిత్వశాఖ ప్రతి ఏటా జూలై 10 జాతీయ మత్స్య(చేపల) రైతుల దినోత్సవాన్ని జరుపుకుంటోందని ప్రకృతి పర్యావరణ సంస్థ,మత్స్య రైతు సంఘాల ప్రతినిధి మొహమ్మద్ షాకిర్ అన్నారు. జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బెజ్జంకి ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రకృతి పర్యావరణ సంస్థ నేతృత్వంలో మండలలోని పెద్దమ్మగుడి అవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**మిరుదొడ్డి, జూలై 10, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తోట అంజిరెడ్డి, మండల తాజా మాజీ వైస్ ఎంపిపి పోలీసు రాజులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల కావస్తున్న రైతులకు ఇంత వరకు రైతు భరోసా ఇవ్వడంలో రైతులకు రుణ మాఫీ చేయడంలో సిఎం రేవంత్‌రెడ్డి పూర్తి విఫలమయ్యారని తెలిపారు. మహిళ లకు అర్టీసిలో ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళను ఇబ్బందులకు గురి చేయడం తప్ప వచ్చిందేమిలేదన్నారు. పెన్షన్ రూ.2 వేల నుంచి రూ. 4వేలకు పెంచుతామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తాజా మాజీ సర్పంచ్ తుమ్మల బాలరాజు, మాజీ ఎంపిటిసి గొట్టం బైరయ్య, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం హామీలను అమలుచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

**పుల్కల్, జూలై 10, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మెనిఫోస్టోలో పేర్కొన్న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కుమ్మరి పండరి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పుల్కల్‌లోని రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు పండరి నాయకులతో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కుమ్మరి పండరి మాట్లాడుతూ 2 లక్షల రూపాయల రుణమాఫీకి ఎలాంటి ఆంక్షలు విధించకుండా రైతులందరికి రుణాలను మాఫీ చేయాలన్నారు. రెండు నెలలు గడుస్తున్నా రైతు భరోసా ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని, వెంటనే రైతులకు రైతు భరోసా అందించాలన్నారు. కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతు బరోసా వెంటనే అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ భీమా యోజన పంట భీమాను వెంటనే రాష్ట్రంలో అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టో హామీలు అమలు చేయకుంటే పార్టీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షులు చేరాల శ్రీశైలం, కార్యదర్శి దత్తాత్రేయ, నాయకులు నర్సింలు, శివశంకర్, శ్రీకాంత్, సోషల్ మీడియా కో-కన్వీనర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు శుభ్రం చేయాలి : అశోక్‌గౌడ్

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త :** వర్షాకాలం అయినందున నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లన్ని, వీధులన్ని పరిశుభ్రం చేయాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సిబ్బందిని ఆదేశించారు. బుదవారం నర్సాపూర్ మున్సిపల్ పరిదిలోని 9 వ వార్డు లో ఆయన పర్యటించి పరిశుభ్రతను పరశీలించారు.ఈ సందర్భంగా రోడ్లలలోని పిచ్చి మొక్కలను తీసివేయలని, వెంకటేశ్వర కాలనీలో నీటి ఇబ్బందులను తొలిగించడానికి పైప్‌లైన్‌లు వేయాలని తదితర పనులనుఅధికారులకు , సిబ్బందికి తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ యా వార్డులలోని ప్రజలంతా పరిసరాలను ఎప్పుడికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు.ఈ కార్యక్రమంలోమున్సిఫల్ మేనేజర్ మదుసూదన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, శానిటెరి ఇన్స్‌పెక్టర్ సల్ల మురళీ,వార్డు అధికారి సురేశ్, జావాన్లు ఆర్‌పిలు, మున్సిఫల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే

## జిల్లా వైద్య అధికారి వైద్యాధికారులకు సూచన

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ ప్రోగ్రాం ఆఫీసర్స్,సిహెచ్‌సిల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ మాట్లాడుతూ...ముఖ్యంగా మలేరియా ,డెంగ్యూ ఇతర అంటువ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వే చేయడం ద్వారా జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి రక్త పూతలు సేకరించి టి-డైగ్నోస్టిక్స్ ల్యాబ్ ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ ఐన వారికి తగు చికిత్స అందేవిధంగా జాగ్రత్త పడడం,దోమకాటుకు గురికా కుండా ప్రజలకు అవగాహన కల్పించడం,ప్రతి సిహెచ్‌సిలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయడం, అత్యవసర కేసులకు చికిత్స చేయడానికి సరిపడా బెడ్స్ రిజర్వ్ చేసుకోవడం ఓఆర్ఎస్ ప్యాకెట్స్ నిల్వలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉంచుకోవాలని ఆదేశించారు. వ్యాధుల నియంత్రణకు వివిధ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రస్తుతం చికిత్స పొందుతున్న అన్ని లెప్రసీ కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా గర్భిణీలకు అన్ని రకాల సేవలు అందించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు.11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి కుటుంబ నియంత్రణ, పిల్లల మధ్య ఎడం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రతి గురువారం పాఠశాలలో ఐరన్ ఫోలిక్ మాత్రలు విద్యార్థుల చేత మింగించాలని జులై15 నుండి ఆగస్టు 15 వరకు పాఠ శాల విద్యార్థులకు మరియు బడి బయట పిల్లలకు మెదడు వాపు వ్యాధి నియంత్రణకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని ప్రస్తుతం జరుగుతున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో ఓఆర్ఎస్ జింక్ కార్నర్ పాయింట్‌లను గుర్తించాలని,పాఠశాల రెసిడెన్షియల్ హాస్టల్లో విద్యార్థులకు పరిశుభ్రత ,హ్యాండ్ వాషింగ్ గురించి అవగాహణ కలిగించాలని పరిసరాలు, కిచెన్,భోజనశాలలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవీంద్ర యాద్,డాక్టర్ జీవరాజ్,డాక్టర్ సాయి బాబా,జిల్లా వైద్యాధికారులు,పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

### -ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి శేఖర్

**గజ్వేల్, జూలై 10 (ప్రభాతవార్త):** విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ గత 5 సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ తెలిపారు. బుధవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం చిన్న చూపు చూడడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, దీనివల్ల విద్యార్థులు ఫీజులు కట్టలేక పై చదువులు చదవలేకపోతున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు కోనేరు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ప్రణయ్, నాయకులు వేముల ప్రవీణ్, శేఖర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్మనగూడలో ఉపాధ్యాయులకు సన్మానం

**గజ్వేల్, జూలై 10 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు జి.గోపికల, డి.వేణులను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు గోపికల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లను అందజేయగా ఉపాధ్యాయుడు వేణు మాజీ చైర్మన్ సిద్దాల శివకుమార్‌కు రూ.వెయ్యి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పరపల్లి నాగభూషణం, ఉపాధ్యాయులు సిహెచ్.భద్రమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన మల్లికార్జున్

**గజ్వేల్, జూలై 10 (ప్రభాతవార్త):** విద్యాశాఖ నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డిని సిపిఎస్ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన గజ్వేల్ ప్రాంతానికి చెందిన నరసింహారెడ్డి నేడు విద్యాశాఖ సంచాలకులుగా ఎదగడం ఉపాధ్యాయ లోకానికి గర్వకారణమన్నారు.

## ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

**శామీర్‌పేట, జూలై 10, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపాల్టీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం ప్రశాంతంగ జరిగింది. గత కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో గొడవలు జరిగి నిర్వహించలేక పోయారు. దీంతో మళ్లీ బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులపై, సమస్యల పరిష్కారం విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రశాంతంగ ఉండి చర్చించారు. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభలో చర్చించి తీర్మాణాలకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగ మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ పలు అభివృద్ధి పనులను చేపట్టటానికి చర్చించటం జరిగిందన్నారు. అదే విధంగ త్వరలో జరగనున్న బోనాల పండుగ సందర్భంగ చేపట్టాల్సిన పనులపై చర్చించటం జరిగిందన్నారు. వనమహోత్సవం సందర్భంగ మొక్కలు నాటటానికి ప్రణాళికలు చేయటం జరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితితులతో సీజనల్ వ్యాధులు ప్రభలకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలని మలేరియా, డెంగ్యూ వంటివి సోకకుండ ప్రజలను అప్రమత్తం చేయటానికి, తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. త్వరలో అన్ని వార్డులలో ఆయా వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో చర్చించి నివృత్తి చేసుకోవాలని, త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించటం జరిగిందన్నారు. ఈ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి అభివృద్ధి పనులు చేపట్టటానికి తీర్మాణాలు చేయటం,ఆమోదం పొందటం జరిగింది. ఈ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కె.రాజేశ్వర్‌రావుతో పాటు కమిషనర్ వెంకట గోపాల్, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, మేనేజర్ శ్రవణ్‌కుమార్, డిఇఇ సునీత, సిబ్బంది భాస్కర్, రేణుక, ఎ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం

**చేవెళ్ల, జులై 10 ప్రభాతవార్త :** పేద విద్యార్థుల విద్యభ్యున్నతికి దాతలు మందుకు వచ్చి నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని చేవెళ్ల మాజీ ఎంపిపి మంగలి బాల్‌రాజ్ అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామంలోని తక్షశీల పాఠశాల విద్యార్థులకు, అదే గ్రామానికి చెందిన మంగలి శంకరయ్య, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ఉచితంగా పాఠ్యపుస్తకాలను మాజీ ఎంపిపి బాల్‌రాజ్ చేతుల మీదుగా పంపిణి చేయించారు.పాఠశాల ప్రిన్సిపాల్ బాసిత్‌పాషా, సీనియర్ నాయకులు రామచంద్రయ్య, నర్సింలు, నయిమ్, బాబా,యూసుఫ్, గోపాల్, తాజొద్దీన్, అజ్జు, మహేష్, మునీర్‌ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**తాండూరు, జూలై 10, ప్రభాతవార్త :** తాండూరులోని ప్రభు త్వ జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి వైద్యులకు సూ చించారు. జిల్లా ఆసుపత్రిలో మౌళిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యు లు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చా రు. మంగళవారం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోపి జనరల్ వార్డు, స్త్రీల మెడికల్ వార్డు, బ్లడ్ బ్యాంకు తదితర వార్డులను సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలు, వసతులపై అడిగి తెలు సుకు న్నారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాదులను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఆసుపత్రిని సందర్శించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగు లకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు దేవాలయాలతో సమా నమని అన్నారు. తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి జిల్లా లోనే పెద్ద ఆసుపత్రి అని, తాండూరు ప్రాంత ప్రజలతో పాటు కోడంగల్, పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుండి ఎంతో మంది రోగులు వస్తుంటారని, జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలు అందించాలని సూ చించారు. జిల్లా ఆసుపత్రిలో మౌళిక సదుపాయాల ఏర్పా టుకు కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి సంబందింత మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని అన్నారు. ఆసుపత్రిలో సిటీ స్కాన్ సేవలపై వస్తున్న ఆరోపణలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బం దులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మురళీకృష్ణాగౌడ్, జుబేర్‌లాల, కమిషనర్ విక్రంసింహారెడ్డి, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మూర్తి, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం..మిస్సింగ్ కేసు నమోదు

**శామీర్‌పేట, జూలై 10, ప్రభాతవార్త** తూంకుంటలో నివసిస్తున్న వ్యత్యావత్ మన్ని (27) కనిపించటం లేదని ఆమె భర్త వ్యత్యావత్ రమేశ్ శామీర్‌పేట పోలీసులను ఆశ్రయిం చటంతో పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేశారు. బుధవారం శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు అందటంతో మహిళ మిస్సింగ్ కేసును నమోదు చేశారు.శామీర్‌పేట పోలీ సుల కథనం ప్రకారం శామీర్‌పేట మండలం తూంకుంటలో వ్యత్యావత్ రమేశ్ భార్య వ్యత్యావత్ మన్ని (27) నివసిస్తు న్నారు. అయితే ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం భార్య,భర్త నిద్రలో ఉన్నారు. అయితే సాయంత్రం 5గంటలకు నిద్ర నుం చి లేచే సరికి తన భార్య మన్ని కనిపించటం లేదని పోలీసుల కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భార్య,భర్తలు కూలీ పనిచేసు కుంటారని అన్నారు. భార్య మని కనిపించటం లేదని బుధవా రం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మిస్సింగ్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఎత్తు 5.2ఫీట్స్ ఉంటుందని, రంగు చామన చాయ కలర్ ఉంటుందన్నారు. లంబాడి, తెలుగు భాషలు మాట్లాడుతుందన్నారు. దస్తులు బ్లూకలర్ చీర ధరించి ఉందన్నారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబీ, పార్లమెంట్ ఎన్నికల్లో పట్టుబడ్డ మద్యం ధ్వంసం

### పోలీసు అధికారులు సమక్షంలో మద్యం బాటిళ్లు ధ్వంసం

**మొయినాబాద్, జూలై 10, ప్రభాతవార్త:**

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్సైజ్ మరియు పోలీస్ సిబ్బందికి పట్టుబడినటువంటి మద్యాన్ని బుధ వారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లోని రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డిసిపి విజయ్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీని వాస్‌రెడ్డి, సిఐ ప్రదీప్ మోయినాబాద్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డిల సమక్షంలో 8551 లీటర్ల మద్యాన్ని బుధవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బెల్టు షాపుల్లో రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి 9 పోలీస్‌స్టేన్లో పట్టు బడ్డ మద్యం బాటిళ్లను డిప్యూటీ కమి షనర్ ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ ఆర్డర్ ప్రకారం పంచుల సమక్షంలో ధ్వంసం చేశామని తెలిపారు.

మొత్తం రాజేంద్రనగర్ డివిజన్లో 333 ఎక్సైజ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటిల్లో బీర్లు విస్కీ కోటర్లు రకరకాల మద్యం బాటి ళ్లను 9 పోలీస్‌స్టేషన్ పరిధిలో 3028 లీటర్లు, నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి లో 570 లీటర్లు, మైలార్‌దేవరపల్లి పరిధిలో 765.38 లీటర్లు శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో1200.34 లీటర్లు మోకిలా పోలీస్‌స్టేషన్ పరిధిలో 888.34 చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 1140 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ మరియు పోలీసులకు పట్టుబడిందని వాటిని బుధవారం పోలీస్‌స్టేషన్ ఆధారంగా తీసుకొచ్చి ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఆప్కారి నిబంధనల ప్రకారం పంచుల పూర్తి చేసుకుని ఎక్సైజ్ అధికారుల సమక్షంలో మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు తెలి పారు.ఈ కార్య క్రమంలో ఎక్సైజ్ అధికారులు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను తిరగ రాసే సత్తా ప్రజలదే!

## రానున్న రోజులు ఇక బిజెపివే : ఎంపి ఈటల రాజేందర్

**శామీర్‌పేట, జూలై 10, ప్రభాతవార్త** చరిత్రను తిరిగరాసే సత్తా ప్రజలకే ఉందని, రానున్న రోజులు ఇక బిజెపివేనని, ఎలాంటి ప్రలోభాలకు ప్రజలు లొంగకుండ ఎంపిగా గెలిపించిన ఘనత మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు దక్కుతుందని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి ఎంపిగా భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు, బిజెపి నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు అందరికి ఎంపి ఈటల రాజేందర్ కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం శామీర్‌పేట మండలం లోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ పంక్షన్‌హాల్‌లో మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ బిజెపి నాయకుల, కార్యకర్తల కృతజ్ఞతా సభ జరిగింది. ఈ సందర్భంగ పలువురు ఎంపి ఈటల రాజేందర్‌ను ఘనంగ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీ చేసిన ఖర్చు, అధికార దుర్వినియోగం చేసినా మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలు ధర్మానికి, సత్యానికి, న్యాయానికి పట్టం గట్టారని,ఎంపిగా భారీ మెజార్టీతో గెలిపించారని కాళ్లు మొక్కినా తక్కువేనని దన్యవాదాలు తెలియజేస్తు న్నన్నారు. దేశంలోనే బిజెపి ఓటింగ్ శాతం పెరిగింది తెలంగాణ రాష్ట్రంలోనే అని అన్నారు. వాస్తవంగ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావాల్సి ఉందని, అయితే కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు, ప్రలోభ హామీలతో అధికా రంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. కొట్లాడింది,పోరాడింది బిజెపి అని, అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ దొంగ దెబ్బతీసిందన్నారు. దేశ సమగ్రత,ప్రతిష్టను కాపాడటంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని నమ్మారని, దేశ ప్రజలు ఆదరించారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీని ప్రజలు పదేళ్లలోపే బొంద పెట్టారని ఈటల రాజేందర్ విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల నుంచి విశ్వాసం కోల్పోయిందని, నియంతృత్వ దోరణిని అడ్డుకున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదని వేలాది కోట్ల రూపాయలతో కూడుకున్నదన్నారు. విద్యార్థి, నిరుద్యోగ యువతకు బిజెపి అండగ ఉంటుం దని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలలు దాటుతున్నా విద్యార్థులకు, నిరుద్యోగులకు న్యాయం జరగటం లేదని, ఎన్నికల్లో ఆశలతో గెలిపించారని, వారి ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగా రుస్తుందని ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఇక రానున్న రోజులు బిజెపివేనని, తెలంగాణలో బిజెపి అధికారం దిశగా భవిషత్‌లో ముందుకు వెళుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెం బ్లీల, జిల్లా, మండలాల, మున్సిపాల్టీల, గ్రామాల బిజెపి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



గుట్కా ఫ్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## గుట్కా ప్యాకెట్ల స్వాధీనం-కేసు నమోదు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు సమీపంలోని వినాయక కిరాణా షాప్‌లో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, టూ టౌన్ పోలీసులు బుధవారం దాడి చేసి రూ.61,108 విలువగల గుట్కా ఫ్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వినాయక కిరాణా షాప్‌లో షాపు యజమాని లక్ష్మీనారాయణ తన షాపులో ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కలిగి ఉండడంతో పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**బెజ్జంకి, జూలై 11, ప్రభాతవార్త :** మిత్రుడి కుటుంబానికి అర్థిక సహాయం అందజేసి తమ స్నేహ బంధాన్ని చాటుకున్నారు. తోటి మిత్రులు మండల పరిధిలోని వీరాపూర్ గ్రామానికి చెందిన జనగాం శ్రావణ్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల అర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ముంజ శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, మహేష్, రాజు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి



తహసీల్ధార్ మన్నన్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఐటియూ

**చిన్నశంకరంపేట, జూలై 10,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు చ్చిఇన హామీలను అమలు చేయాలని సీఐటియూ మండల నాయకుడు అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం చిన్నశంకరంపేటలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, కార్మిక చట్టాల పేరుతో దేశంలోని కార్మికుల శ్రమను దోచుకుంటుందని ఆరోపించారు. పెరుగుతున్న దరలకు సమానంగా వేతనాలు పెంచే చట్టాలను తీసుకురాకుండా, ప్రవేటు పరిశ్రమలకు అనుకూలంగా చట్టలను తేవడం సిగ్గుచేటన్నారు. సీఐటియూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మన్నన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దేవమ్మ, ఉర్మిల,కవిత,సిద్దమ్మ, వీణ,అనిత, తదితరులు పాల్గోన్నారు.

## కార్మిక చట్టాలను అమలు చేయాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు



నిరసన చేస్తున్న కార్మికులు తదితరులు

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త :** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలని అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. బుదవారం సిఐటియు అధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలో ప్ల కార్డులతో నిరసన తెలియ జేశారు. ఈసందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 3 వ సారి అధికారంలోకి వచ్చిన కూడ కార్మిక ప్రజా వ్యతిరేక విదానాలను అనుసరించడం పై మండిపడ్డారు.కార్మికులు ఎన్నో పోరాటలు చేసి సాదించకున్న కార్మిక చట్టాలనుతొలిగిస్తు 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు.ఈ కోడ్‌ల వల్ల కార్మికులు ఎంతగానో నష్టపోతారని తెలిపారు.ఒక వైపు నిత్యావసర ధరలు ఆకాశనంటుతున్న కార్మికుల వేతనాలుఅంతంత మాత్రమే ఉన్నాయన్నారు.పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అనేక సంవ్సరాలుగా ఉద్యోగ భద్రత, పర్మినెంట్,ఈఎస్ఐ, ఫిఎఫ్ సౌకర్యాలు లేవని అవి కల్పించాలని అన్నారు.ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో కార్మికుల అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి జిల్లా అద్యక్షురాలు అన్నపూర్ణ, మున్సిఫల్ జిల్లా అద్యక్షులు రాలు పుష్ప, కార్మికులు అశోక్, శంకర్, అనిత, సంగీత, రాములు, శంకరయ్య, ఎల్లం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓబీ, గురుకుల్, బస్సుల సమస్యలు పరిష్కరించాలి

**ఘట్‌కేసర్, జూలై 10, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు పూర్తి అయ్యేలా, గురుకుల్ విద్యాసంస్థ మిగులు పనులు చేపట్టాలని, ఆర్‌ఓబీ బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలోని రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తి కాక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంట్రాక్టర్లు మారుతున్నా పనులు పూర్తి కావడం లేదని ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయాలని, ఆర్‌ఓబీ నిర్వాసితులకు తగిన నష్టపరిహారం ఇపి ్పంచేలా మంత్రితో చర్చి ంచాలని కోరారు. వంతెన పనుల కారణంగా జిల్లా సర్వీస్ బస్సులు ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్‌కు రాకుండా బైపాస్ రహదారి మీదుగా వెళ్తుండటంతో ప్రయాణిలకు అసౌకర్యంగా ఏర్పడుతుందని జిల్లా బస్సులు బస్‌టెర్మినల్‌కు వచ్చి ఎదులాబాద్ రోడ్డు వియూపి వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా వెళ్లేలా అధికారులకు తెలియజేయాలని, గురుకుల్‌లో అసంపూర్తిగా మిగిలిపోయిన తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని వారు విజ్ఞప్తి చేయగా సుధీర్‌రెడ్డి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి అంజనేయులుగౌడ్, షేక్‌జహంగీర్, బేతాల నర్సింగ్‌రావు, మాజీ ఎంపిటిసిలు దీకొండ రఘు, మేకల నర్సింగ్‌రావు, సొసైటీ మాజీ డైరక్టర్ కందకట్ల పద్మారెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ ప్రధానకార్యదర్శి బర్ల హరిశంకర్, ఉపాధ్యక్షులు పడిగెం వెంకటేశ్వరరావు, నాయకులు అబ్దుల్‌అజీజ్, బొట్టు కృపానిధి, సార మురళీగౌడ్, ఎండి.నజీర్, శ్రీశైలం, బబ్బురి శ్రీనివాస్‌గౌడ్, సదానంద్, ఎండి.సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కోటారి నర్సింలును సన్మానిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్

## అవార్డు గ్రహీతకు ఘనంగా సన్మానం

**నారాయణఖేడ్ టౌన్, జులై 10, ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుగ్రహీత కోటారి నర్సింలును జహీరాబాద్‌లో జరిగిన ఎఐ ఎస్ఎఫ్ జిల్లా మహాసభలో బుధవారం ఘనంగా సన్మానించారు. మహా సభకు కోటారి నర్సింలు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్ నర్సింలును శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జలాలొద్దీన్ మాట్లాడుతూ నారాయణఖేడ్ పరిసరాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాలకు నర్సింలు సేవ చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రజా సేవలను గుర్తించి స్టార్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవార్డులు అందించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి, జిల్లా నాయకులు ఆనంద్, చిరంజీవి, అశోక్, నాగలిగిద్ద గణపతి, ఇసాక్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి సహకరించండి : కార్పొరేటర్



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ బుధవారం జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతి చేశారు. రామచంద్రాపురం గ్రామంలో పలు కాలనీల్లోని సిసి రోడ్ల సమస్య బస్సు రూట్‌లో సెంటర్ డివైడర్‌తో కూడిన 10 మీటర్ల రోడ్డు నిర్మిస్తే రామచంద్రాపురం ముఖద్వారం సుందరీకరణగా మారుతుందని, సండే మార్కెట్ నుంచి ఈఎస్ఐ రోడ్డు వరకు మిగిలిపోయిన సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కమీషనర్ దృష్టికి తీసుకునొగా కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం : కార్పొరేటర్



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ ఇంధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూలై 10, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్ఐజి కాలనీలోని పార్కులో మొక్కలునాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలలో వీలైనన్ని మొక్కలు నాటి అవి చెట్లుగా పెరిగేలా సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో యుబిడి మేనేజర్ సమీరా, ఎల్ఐజి కాలనీ అధ్యక్షులు యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, రాంబాబు, రాజలింగం, సర్కిల్ కార్యదర్శి భాస్కర్ ముదిరాజ్, యూత్ అధ్యక్షులు నరసింహ, మైనార్టీ కార్యదర్శి గౌస్, డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అజీముద్దీన్, బిఆర్ఎస్ నాయకులు పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారీ, సంపత్‌గౌడ్, తిలవాత్, చిన్న, శేఖర్, కుతుబుద్దీన్, జాకీర్, రాకేష్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోండి



ఎంపిడిఓకు వినతి పత్రం అందేచేస్తున్న పంచాయతీ కార్మికులు

**ఝరాసంగం, జూలై 10, ప్రభాతవార్త:** నెలలతరబడి వేతనాలు అందక పస్తులుంటున్నామని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఝరాసంగంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓకు మండలంలోని ఆయా గ్రామ పంచాయితీ కార్మికులు సిఐటియు మండల అధ్యక్షులు చంద్రన్నతో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చంద్రన్న మాట్లాడుతూ నిత్యం కార్మికులు గ్రామాల్లో పనిచేస్తున్నా నెల నెల వేతనాలు అందించకుంటూ వారు కుటుంబాలను ఎలా సాకుకుంటారని ప్రశ్నించారు. జిఓ నంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. జిఓ 60 ప్రకారం కనీస వేతనం 26వేల రూపాయలుగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు సంగమేశ్, ఉపాధ్యక్షులు బాలరాజ్, ప్రధాన కార్యదర్శి రాందాస్, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## కేతకి ఆలయంలో పార్కింగ్‌కు వేలం

### -రూ. 2లక్షల 65 వేలకు దక్కించుకున్న గోపాల్

**ఝరాసంగం, జూలై 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వాహనాల పార్కింగ్ కొరకు బుధవారం ఆలయ అధికారులు వేలం పాటను నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలం పాటలో 8 మంది పాల్గొని వేలం పాడారు. అయితే ఝరాసంగం గ్రామానికి చెందిన గోపాల్ 2లక్షల 65వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ జోషి, బసయ్యస్వామి, జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేతకి ఆలయ ఆవరణలో పార్కింగ్‌కు వేలం వేస్తున్న అధికారులు



చౌటకూరులో ధర్నాలో పాల్గొన్న కార్మికులు




పాపన్నపేటలో డిమాండ్స్ డేలో పాల్గొన్న ఆశ వర్కర్లు

# ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలి

### డిమాండ్స్ డేలో సిఐటియు నాయకులు

**చౌటకూరు, జులై 10, ప్రభాతవార్త:** ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలన్న యోచనను విరమించుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఏ.నాగభూషణం అన్నారు. బుధవారం చౌటకూరులో సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే కార్యక్రమానికి నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై ఆశవర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ నేషనల్ మనీ ట్రైజేషన్ పైప్‌లైన్‌ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాక్లను వేలం వేయడాన్ని నిలిపివేయాలన్నారు. సింగరేణికి గనులునేరుగా కేటాయించాలని, కార్మికులందరికి కనీస వేతనం రూ. 25 వేల రూపాయలు చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్లకు పరీక్షలు రద్దుచేయాలని,వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.కార్యక్రమంలో ఆశనాయకురాలు సువర్ణ, సునీత,స్వరూప, లక్ష్మి, లావణ్య, రేష్మ, ప్రజానాట్య మండలి మండల నాయకులు బి సత్యనారాయణ, బి మల్లేశం, కే భుజంగం, యం గంగరాజు, సిహెచ్ మల్లేష్ పాల్గొన్నారు.

### పాపన్నపేటలో...

**పాపన్నపేట, జులై 10, ప్రభాతవార్త:** ఆశలకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పాపన్నపేటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు పెంటమ్మ, దుర్గ,శివలీల మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం సంస్కరణలు, ప్రవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ఉరకలు వేస్తోందని విచారం వ్యక్తం చేశారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం 26వేల రూపాయలకు పెంచాలన్నారు. ఈపీఎస్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానను భారీగా తగ్గించిందని, కార్పోరేట్ మతోన్మాదులను ప్రసన్నం చేసుకుని వారికి లాభాలు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు మంజుల, సుగుణ, శ్యామల, నవనీత, లలిత, లక్ష్మి, మంజుల, చంద్రకళ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

### జోగిపేటలో...

**జోగిపేట, జులై 10,ప్రభాతవార్త:** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్‌చేసి కనీస వేతనాలు అందచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో తహసీల్దార్ ఐ.వి. భాస్కర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్మికుల డిమాండ్స్‌డే సందర్భంగా జోగిపేటలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల తమ మొండివైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ప్రభాకర్, ఎమ్మెస్ కంపెనీ నాగేందర్‌రెడ్డి, సురేష్, అంగన్‌వాడి యూనియన్ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

## ఎస్ఎస్‌సిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

**వెల్దుర్తి, జూలై 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఎంఈవో యాదగిరి, కీర్తి శేషులు కట్ల సత్తయ్య మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నరేందర్ ఘనంగా సన్మానించారు. పది జీపిఏ సాధించిన విద్యార్థులు అభిలాష్, జాహ్నవి, దీపికలకు కట్ల సత్తయ్య మెమోరియల్ ట్రస్టు సహకారంతో డాక్టర్ నరేందర్ వారి చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ చదువులో ప్రతిభ చూపించిన వారికి ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందన్నారు. మంచి ఫలితాలు సాధించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, భోజనం ఉచితం అందిస్తున్నట్లు తెలిపారు.

### అన్నదాన కార్యక్రమం...

కీర్తిశేషులు కట్ల సత్తయ్య మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నరేందర్ తన తండ్రి సత్తయ్య మెమోరియల్ ట్రస్టు ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్ కట్ల సత్తయ్య మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులకు నరేందర్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు క్రీడా సామాగ్రిని ఇవ్వడానికి ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, నరేందర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన రాష్ట్ర అధ్యక్షులు

**సంగారెడ్డి టౌన్, జులై 10, ప్రభాతవార్త:** తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన ముత్తినేని వీరయ్య వర్మను రాష్ట్ర వెన్నెముక వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షఫీ అహ్మద్ బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి అధ్యక్షులు రాజేందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొని చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నివీర్ వాయు నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్ టౌన్, జులై 10 (ప్రభాతవార్త): భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా పనిచేసేందుకు అవివాహితులైన అభ్యర్థుల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నీల చంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకు ముగుస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలి అనుకునేవారు 8290694814, 9948643620 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

**మర్కుక్, జులై 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థిని, విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై, షీటీమ్ విధుల గురించి, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై మర్కుక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని, మాయమాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడినా, ఎవరైనా విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని విద్యార్థులు గుర్తించి చదువుపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ షీటీమ్ బృందంతో పాటు ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రాంచంద్రారెడ్డితో పాటు మర్కుక్ పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు వెంకటేశం, ఓంకార్ రాధాకృష్ణ, రామకృష్ణారెడ్డి, కనకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు




తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

**జహీరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** కనీస వేతనం 26వేల రూపాయలను అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని రెవిన్యూ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా (డిమాండ్స్ డే)నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఆపాలన్నారు. కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలన్నారు. బిజెపి ప్రభుత్వం సంస్కరణలు, ప్రవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ఉరకలు వేస్తోందని విచారం వ్యక్తం చేశారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని,కనీస వేతనం 26వేల రూపాయలకు పెంచాలన్నారు. ఈపీఎస్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానను భారీగా తగ్గించిందని, కార్పోరేట్ మతన్మాదులను ప్రసన్నం చేసుకుని వారికి లాభాలు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను 4వతరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మహీంద్రా ఆండ్ మహీంద్రా, మహీంద్రా ట్రాక్టర్స్, సిఐఈ తదితర పరిశ్రమల వద్ద సైతం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో నాయకుల రాజిరెడ్డి, గణేష్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ డిపోను తనిఖీ చేసిన ఆర్ఎం



సూపర్‌వైజర్లతో సమావేశమైన ఆర్టీసి రీజినల్ మేనేజర్ ప్రభులత

**నారాయణఖేడ్ టౌన్, జులై 10, ప్రభాతవార్త:** చెయ్యెత్తిన చోట ఆర్టీసి బస్సును ఆపి ప్రయాణీకులను బస్సుల్లో ఎక్కించుకుని ఆర్టీసి ఆదాయానికి కృషి చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత సూచించారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసి డిపోను ఆర్ఎం తనిఖీ చేసి డిపోలో సూపర్‌వైజర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.ప్రయాణీకులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ మల్లేశయ్యకు సూచించారు. ఈ నెల 21న గురు పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నామని, 4500 రూపాయలతో అరుణాచలానికి రాను పోనూ బస్సు చార్జీలు సరిపోతాయన్నారు. ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరి 22న సాయంత్రం నారాయణఖేడ్‌కు వాపసు రావడం జరుగుతుందన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించార. కార్యక్రమంలో ఆర్ఎం పిఏ కనకరాజు, డిపో అసిస్టెంట్ మేనేజర్ నర్సింలు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ దశరథరావు, ఎస్టీయు నందులాల్, సూపరింటిడెంట్ ప్రవీణ్, అకౌంటెంట్ విశ్వనాథ్, సీనియర్ అసిస్టెంట్ హన్మయ్య, పిఆర్ఓ పాండు, కంప్యూటర్ ఆపరేటర్ డేవిడ్, చంద్రయ్య, నరేందర్, దీన్ దయాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఆట వస్తువులు,ఎడ్యుకేషన్ కిట్స్ అందజేత

**పటాన్‌చెరు,జూలై 10,ప్రభాతవార్త:** పటాన్‌చెరు మండలం బచ్చుగూడ, పోచారం గ్రామాల్లోని ఎంపీయుపీఎస్ అలాగే యంపి పై యాస్ పాఠశాలలో పార్కర్ హని ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంధ సంస్థ వారు పార్కు,ఆట వస్తువులు మరియు ఎడ్యుకేషన్ కిట్స్,లేబరి బుక్స్ సరఫరా చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మా పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మదు సుధన్‌రెడ్డి, సిడబ్ల్యూసి మెంబర్ జి వెంకటేశం, పార్కర్ హనీఫిన్ వారి సిబ్బంది శ్రీలక్ష్మి, పోచారం ఎంపీయూపిఎస్ పాఠశాల హెచ్ఎం ప్రకాష్, బచ్చుగూడ హెచ్ఎమ్ జ్యోతి, బుజ్జగ రెడ్డి, నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లావణ్య, కో ఆర్డినేటర్ మహజీబ్, మెడ్వాన్ కో ఆర్డినేటర్ హఫీజ్, స్వప్న, ఆమదయ్య, ముస్తప తదితరులు పాల్గొన్నారు.



గోరింటాకు సంబరాల్లో పాల్గొన్న మహిళలు

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు

**రామాయంపేట, జూలై 10, ప్రభాతవార్త :** ఆషాడమాసం పురస్కరించుకొని రామాయంపేట పట్టణములో ఆర్యవైశ్య మహాసభ మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాలు, గోరింటాకు సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీవాణి అశోక్, కార్యదర్శి బొమ్మెర్ల లావణ్య, కోశాధికారి గుండు శ్యామల, పిఆర్ఓ కొండూరి మౌలిక తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలందరూ పాల్గొన్నారు. ఉదయం నుంచి ఎన్నో రకాల ఆటలు, పాటలతో పాటు మరెన్నో వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీల్లో విజేతలైన వారందరికీ బహుమతులను అందజేశారు.

## కెసిఆర్ కాలనీ కమిటీ నూతన కార్యవర్గం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 10, ప్రభాతవార్త :**

రామాయంపేట మున్సిపాలిటీలోని కేసీఆర్ కాలనీ (డబుల్ బెడ్‌రూమ్) కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షురాలుగా కార్మిక నాయకురాలు జి. బాలమణిని ఎన్నుకున్న సభ్యులు అధ్యక్షులుగా కట్ట ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా షేక్ ఇమామ్, గొంగళ్ల వెంకటి, బండారి రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కైరంకొండ చంద్రం, పీఆర్ఓగా లద్ద నర్సింలు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్‌కె. చాంద్‌పాషా, దేశాయిపేట శ్రీనివాస్ సాగర్, దిడ్డి మల్లేశం, కోశాధికారిగా తూర్పు ఎల్లాగౌడ్, ఉప కోశాధికారిగా చిట్టిమల్ల నగేష్, ప్రచార కార్యదర్శులుగా గాజుల రవి, మద్దెల కృష్ణ, సలహాదారులుగా మెక్కొండ పోచయ్య సాగర్, దేవుని రాములు, జాల యాదగిరి, శివశంకర్, బాబుబాయి, కార్యవర్గ సభ్యులుగా కాసర్ల రమేష్, ఎస్‌కె.షాదుల్, మెక్కొండ యాదగిరి సాగర్, పూసల పోచయ్య, గుండ్ల నర్సింలు, మ్యాతరి స్వామి, ఎస్‌కె. అమీమ్, బీర రమేష్, రంగొళ్ల మైసాగౌడ్, రామ్‌దాస్, గట్టయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెండవసారి అధ్యక్షులుగా ఎన్నికైన కట్ట ప్రభాకర్ మాట్లాడుతూ కాలనీ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియపరుస్తూ కాలనీ అభివృద్ధి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపిడివో



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు

**కొల్చారం, జూలై 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాంపూర్, చిన్న ఘనపూర్, సంగాయిపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు పరిశీలించారు. సంగాయిపేట గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామ పంచాయితీల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

**గుమ్మడిదల, జూలై 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమలలో పనిచేస్తున్నటువంటి ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కార్మికుల హక్కుల సాధన దినోత్సవం పురస్కరించుకొని న్యూల్యాండ్ పరిశ్రమ సీఐటీయూ జెండా వద్ద కార్మికులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కార్మికుల హక్కుల సాధన దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఐటీయూ నాయకులు శ్రీధర్‌రావు తెలిపారు. బొంతపల్లి పారిశ్రామిక వాడలో ఉన్నటువంటి అన్ని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలతోపాటు ఈఎస్ఐ, పీఎఫ సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అలాంటి పరిశ్రమల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చ ఏశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎస్. వెంకటేష్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ నరసింహాగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. దేవేందర్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఓటర్లకు రుణపడి ఉంటా

### ఎంపి రఘునందన్‌రావు

**సదాశివపేట, జూలై 10, ప్రభాతవార్త:** సంగారెడ్డి నియోజకవర్గ ఓటర్లను అభినందించడానికి బుధవారం పట్టణంలోని నిర్వహించిన సభకు మెదక్ బిజెపి ఎంపి రఘునందన్‌రావు హాజరై ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ తన విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, నియోజకవర్గంలోని 2 మున్సిపాలిటీలపై బిజెపి జండా ఎగిరేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని హామి చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒడెల మాణిక్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పోచారం రాములు, జిల్లా కార్యదర్శి మందుల నాగరాజు, అసెంబ్లీ కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు కే శ్రీనివాస్, డి సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి, ద్వారక రవి ఆచారి తదితరులు పాల్గొన్నారు.




కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న బిజెపి ఎంపి రఘునందన్‌రావు